సర్వాంగ సుందరంగా.. సర్కారు బడులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు

పోలవరం రూరల్: సర్కారు బడులు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నాడు-నేడు పథకానికి రూపకల్పన చేశారు. దీంతో నాడు-నేడు పథకం కింద విడుదల చేసిన నిధులతో ఒక్కసారిగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పాఠశాలలకు రంగురంగుల ఆధునిక భవనాలను నిర్మించడమే కాకుండా విద్యార్థులకు నూతన డెస్కులు, శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు వాటర్‌ప్లాంట్లు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, బూట్లు, దుస్తులు, టై వంటివి కూడా పాఠశాలలు ప్రారంభించే సమయానికే ఉచితంగా అందజేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీనికితోడు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలుచేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గింది. పోలవరం మండలంలోని 14 పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద 214.7 లక్షలతో పాఠశాలలను అభివృద్ధి చేశారు. ఆయా పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తరగతి గదులు, డెస్కులు ఏర్పాటు చేశారు. అలాగే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించారు. దీంతో తల్లిదండ్రులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆధునిక డెస్కులు


విద్యార్థుల తాగునీటి కోసం ఏర్పాటుచేసిన ఆర్‌వో ప్లాంట్




నాడు-నేడు పథకంలో భాగంగా పోలవరం మండలంలో ఫౌండేషన్ ప్లస్ స్కూళ్లను అభివృద్ధి చేసిన దృశ్యం

పాఠశాలల అభివృద్ధి కోసం వెచ్చించిన నిధుల వివరాలు

పాఠశాల పేరు	వెచ్చించిన మొత్తం (రూ. లక్షల్లో)
చేగొండిపల్లి జీపీఎస్ ట్రైబల్ వెల్ఫేర్	3.83
చేగొండిపల్లి హైస్కూల్ ట్రైబల్ వెల్ఫేర్	29.08
గద్దపల్లి జీపీఎస్ ట్రైబల్ వెల్ఫేర్	8.36
గూటాల ఎంపీపీఎస్ మెయిన్	11.49
గూటాల జెడ్పీ హైస్కూల్	46.78
కుంకాల ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల	26.09
పట్టిసీమ ఎంపీపీఎస్	7.27
దేవరగొంది ఎంపీపీఎస్	5.44
పోలవరం-2 ఎంపీపీఎస్	10.26
ఇటుకలకోట ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల	17.04
ప్రగడపల్లి ఎంపీపీఎస్	17.53
పైడిపాక ఎంపీపీఎస్	7.44
వెంకటరెడ్డిగూడెం ఎంపీపీఎస్	6.73
బోడిగూడెం జీటీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల	17.37
మొత్తం	214.7


విద్యార్థులు హ్యాండ్ వాష్ చేసుకునేందుకు ఏర్పాటు చేసిన దృశ్యం

క్లుప్తంగా

నేడు పొంగుటూరులో వైఎస్సార్ సీపీ సమావేశం

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ మండల సమావేశం సోమవారం పొంగుటూరు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పసుపులేటి రాంబాబు తెలిపారు. మాటూరు ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఎలక్షన్ నిర్వహణతో పాటు 24వ తేదీన తెల్లం రాజ్యలక్ష్మి నామినేషన్ కార్యక్రమం విజయవంతానికి పార్టీ శ్రేణులకు నాయకులు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 4వ వార్డు ఇందిరానగర్ కాలనీ కొత్తపేటలో శ్రీశ్రీ వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద చిప్పాడ వెంకన్న ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బత్తిన చిన్న, జెట్టి ఆదిత్య, పల్లా వెంకటరమణ, గెద్దాడ శ్రీను, గగ్గల కిరణ్ కుమార్, వీరవెల్లి సోమేశ్వరరావు తదితరులు ప్రారంభించారు. ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.

అన్నసమారాధనలు


రామానుజపురంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఐదవ రోజు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. కొయ్యలగూడెం, రామానుజపురం, బయ్యనగూడెం గ్రామాల్లో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సీతారామ లక్ష్మణ హనుమత్ ఉత్సవ విగ్రహాలకి గ్రామోత్సవాలు నిర్వహించారు. అచ్యుతాపురంలో నవమి ఉత్సవాలలో భాగంగా కోలాట ప్రదర్శన జరిపారు.

మద్యం దుకాణాల తనిఖీ


కొయ్యలగూడెంలోని మద్యం దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని రెండు మద్యం దుకాణాలను సెబ్ అధికారులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. మద్యం బాటిళ్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని రిజిస్టర్లను తనిఖీ చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం చిన్నవారిగూడెం గ్రామంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.14000 నగదు, 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

పెదవేగి : అనారోగ్య సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందులతో వెంటాడుతున్న ఓ నిరుపేద కుటుంబానికి శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. ఆదివారం పెదవేగి మండలం విజయరాయి పంచాయతీ ముత్తనవీడు మెట్టకు చెందిన బత్తుల చిరంజీవికి ఇద్దరు కుమారులు. వీరు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బత్తుల అజయ్‌కుమార్ ఆరో తరగతి, బత్తుల తనుష్ కుమార్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీరిరువురు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కనీసం వైద్య ఖర్చులకు కూడా తగినంత స్తోమత లేక అజయ్‌కుమార్ కామెర్లతో, ధనుష్‌కుమార్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. దీనిని గమనించిన శ్రీ సాయి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పి ఉమామహేశ్వరరావు సంస్థకు విషయాన్ని వివరించారు. దీనిపై స్పందించిన సంస్థ సభ్యులు బాధిత కుటుంబాన్ని సందర్శించి వీరి తల్లి బత్తుల భూలక్ష్మికి రూ.15 వేలను అందించారు. విద్యార్థుల ఉన్నత చదువుల కు సంస్థ తరపున సహాయం చేస్తామని సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బీఆర్వీ కుమార్, డీకేఎస్ఎస్ ప్రకాష్ రావు, జి.రాజు, జి.మోహన్ పాల్గొన్నారు

సంక్షేమ పథకాలే జగన్‌కు శ్రీరామరక్ష

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి
- పోలవరం మండలంలో ఎన్నికల ప్రచారం

పోలవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను నేరుగా పేదలకు ఇంటి వద్దకే అందజేశారని, ఆ పథకాలే జగన్‌కు శ్రీరామరక్ష అని వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చేగొంటిపల్లి, సింగన్నపల్లి, మామిడిగొంది, గుంజవరం, రేపల్లెవాడ గ్రామాల్లో ఆమె ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు హారతులు పడుతూ, పూలు చల్లుతూ రాజ్యలక్ష్మికి ఘన స్వాగతం పలికారు. జై జగన్, జైజై జగన్ అంటూ నినదిస్తూ గ్రామాల్లో ఇంటింటికి రాజ్యలక్ష్మిని తీసుకువెళ్లి నాయకులు, కార్యకర్తలు ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని బాధ్యత మనందరిపై ఉందన్నారు. టీడీపీ హయాంలో ఏ పథకం పొందాలన్నా అనేక అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం వలంటీర్ వ్యవస్థను మొట్టమొదటిసారిగా రాష్ట్రంలోనే ఏర్పాటు చేసి ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికి చేరే విధంగా దళారీ వ్యవస్థ లేకుండా చేశారన్నారు. ప్రతి ఇంట్లో ఎంతోకొంత లబ్ధిచేకూరిందని, మేమంతా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎం చేసుకుంటామని ప్రజలు పేర్కొన్నారు. ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందజేస్తున్నారని, వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తూ మళ్లీ మాకు జగన్ బాబే కావాలంటూ ఆప్యాయంగా తెలిపారు. గత నాలుగు పర్యాయాలుగా ఎమ్మెల్యే బాలరాజుకు ఇచ్చిన సహకారాన్నే తనకు అందించాలని రాజ్యలక్ష్మి ఈ సందర్భంగా కోరారు. ఏలూరు ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, చేగొండిపల్లి సర్పంచ్ దారం సీతారామలక్ష్మి, ప్రగడపల్లి ఎంపీటీసీ దాపర్తి మోహన్‌రావు, పార్టీ నాయకులు తిప్పర్తి రాంబాబు, కె.వెంకటేశ్వరరావు, అద్దాల సత్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలవరం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, పార్టీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే మరోసారి రావాలి


మంకినపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, పార్టీ శ్రేణులు

కామవరపుకోట: మేలు జరగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అన్నారు. మండలంలో కామవరపుకోట పంచాయతీలోని మంకెనపల్లి, కొమ్ముగూడెం గ్రామాల్లో ఆదివారం ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటెయ్యాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయలక్ష్మి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, ప్రజలకు ఇంకా మేలు జరగాలన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, సర్పంచ్ కరిపోతూ అనూష, ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, బొల్లు వెంకట సత్యనారాయణ, మేడంకి పద్మ, పొలిమెట్ల ప్రశాంత్, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

126 మందికి కంటి పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రవైద్యశాల వైద్యుల బృందం 126 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 17 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి ఆసుపత్రికి తరలించారు. 27 మందికి సబ్సిడీపై కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్నా వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ బట్టీపై దాడులు

కొయ్యలగూడెం: నాటు సారా బట్టీలను గుర్తించి దాడులు చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ ఆదివారం తెలిపారు. అచ్యుతాపురం గ్రామ సమీపంలో నాటుసారా బట్టి నిర్వహిస్తున్న సమాచారంతో దాడులు చేశామని, ఈ సందర్భంగా సుమారు 90 లీటర్ల సారా, మరో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. ఇందుకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: మండలంలోని రాజుపోతేపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహిస్తున్నందున కొత్తగూడెం ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. కొత్తగూడెం ఫీడర్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు


పడిపూజ నిర్వహించిన దృశ్యం


ఆలయ ప్రాంగణంలో కొలనులో స్వామివారి ఆరట్టు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీఅయ్యప్పస్వామి దేవస్థానం 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రెండోరోజు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో ఉన్న మూలవిరాట్‌కు భస్మాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. ప్రత్యేక పూజల అనంతరం అయ్యప్పస్వామిని విశేషంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న కొలనులో స్వామి వారి ఉత్సవ మూర్తికి అరట్టు కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆరట్టు కార్యక్రమాన్ని వీక్షించారు. 18 మెట్ల వద్ద పడి పూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


విశేష అలంకరణలో అయ్యప్ప స్వామి

వాహన తనిఖీలు విస్తృతపరచాలి

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాస్

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వాహనాల తనిఖీలు విస్తృత పరచాలని ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లా అధికారి జే. శ్రీనివాస్ ఆదేశించారు. ఆదివారం కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా తనిఖీ చేసిన కార్ల నెంబర్ల రిజిస్టర్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జే.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మకంగా సజావుగా ఎన్నికలు జరిపేందుకు ప్రతి ఒక్కరిని సమాయత్తం చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తీసుకువెళ్లే నగదు, మద్యం, పంపకాల వస్తువులను చెక్‌పోస్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది గుర్తించి రాజకీయ నాయకుల ప్రలోభాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సిబ్బంది బాగా పనిచేస్తున్నారని, అందులో కామవరపుకోట చెక్‌పోస్టు తనిఖీలలో 20 మంది వ్యక్తుల నుంచి అనధికార సొమ్మును స్వాధీనం చేసుకోవడం చెక్‌పోస్ట్ సిబ్బంది పనితీరు ఆదర్శనీయమన్నారు. చెక్‌పోస్ట్‌లో పలు వాహనాలను ఆయన తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మొహిద్దీన్, జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్సై కె.శేషారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కె.రమేష్, కె.రామకృష్ణ, జి.సూర్యరావు, గోవర్ధన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్టులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లా అధికారి శ్రీనివాసరావు

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ విజయానికి దోహదపడతాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కేఆర్‌పురంలో అభ్యర్థి తెల్లం రాజలక్ష్మి నామినేషన్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రాజలక్ష్మి ప్రచార సమయంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. అయితే ప్రతిపక్షాలు కావాలనే అభివృద్ధిపై అసత్యప్రచారాలు చేస్తున్నారని అన్నారు. పోలవరం నియోజకవర్గ అభివృద్ధి నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో, నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాత్రమే జరిగిందని గుర్తుచేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, సయ్యద్ బాజీ, గగ్గులోతు మోహన్‌రావు, సోమేశ్వరరావు తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.


కేఆర్‌పురం సమీపంలో నామినేషన్‌లకు వచ్చే వాహనాల పార్కింగ్ ప్లేస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

విర్డ్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ స్పెషల్ క్యాంప్

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో చారిటబుల్ ఆర్థోపెడిక్ స్పెషల్ క్యాంప్ ఆదివారం ప్రారంభమైంది. యూఎస్ఏకు చెందిన డాక్టర్ కామినేని శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఈ క్యాంప్ ఈ నెల 24 వరకు జరుగనుంది. తొలిరోజు భుజం, మోచేయి, తుంటి, మోకాలు సమస్యలతో బాధపడుతున్న 50 మంది రోగులను డాక్టర్ శ్రీనాథ్ పరీక్షించారు. అలాగే 10 మంది దివ్యాంగులకు కాలిపర్స్, ప్రమాదవశాత్తు కాళ్లు పోగొట్టుకున్న 4గురికి అత్యాధునిక కృత్రిమ అవయవాలను ఆస్పత్రిలో అందించారు. గుప్తా ఫౌండేషన్ వారి సహకారంతో ఈ కాలిపర్స్, కృత్రిమ అవయవాలను అందజేసినట్టు ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ఈ క్యాంప్‌లో ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకరరావు, వి.నారాయణమూర్తి, వైద్యులు కె.శ్రీనివాస్, భవ్యాచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్ర బాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.


విర్డ్ ఆస్పత్రిలో బాధితుడికి కృత్రిమ అవయవాన్ని అందజేస్తున్న డాక్టర్ శ్రీనాథ్

రెవెన్యూ భూములు పేదలకు పంచాలి

టి.నరసాపురం: అల్లంచర్ల రాజుపాలెం రెవెన్యూ భూములను పేదలకు పంచాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అల్లంచర్ల రాజుపాలెం పరిధిలోని గ్యాప్ ఏరియా సీపీఐ కామవరపుకోట నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లంచర్ల రాజుపాలెం ప్రాంతంలో దళారులు, పెత్తందారులు భూములు ఆక్రమించుకుని క్రయవిక్రయాలు సాగిస్తున్నారని పట్టించుకోని అధికారులు, నిరుపేదలు రెవెన్యూ భూమిని బాగుచేసి జీడి మొక్కలు నాటి సాగుచేస్తుంటే అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం అన్నారు. అల్లంచర్ల రాజుపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 226, 257లలో 900 ఎకరాలు, సర్వే నెంబర్ 231లో 25 ఎకరాలు భూమి ఉందని, గ్యాప్ ఏరియాలో 1448 ఎకరాలు ఉందని మొత్తం భూమంతా అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారని, దీనికి సంబంధించి రెవెన్యూ, అటవీ శాఖ జాయింట్ సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలన్నారు. పేదలు సాగుచేసుకుంటున్న భూములకు యాజమాన్య హక్కులు వచ్చేవరకు సాగుదారులంతా భూ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీడీఎస్ రాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోలిమే బాలయేసు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గదుల సత్యనారాయణ, హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ కన్వీనర్ శెట్టి నాగబాలాజీ, భూపోరాట సమితి నాయకులు నల్లమోతుల శ్రీనివాసరావు, నల్లమోతుల వెంకటేశ్వరరావు, బాలిన రమణారావు, బీవీ రాఘవులు, పెద్దిరాజు, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.